క్లుప్తంగా

అన్నిదానాల్లో అన్నదానం గొప్పది



హసన్‌పర్తి: అన్ని దానాల్లో అన్నదానం చాలా గొప్పదని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. వాసవి మహిళా క్లబ్ సభ్యురాలు నాగమళ్ల రోజా జయంతిని పురస్కరించుకుని మానసిక దివ్యాంగుల కేంద్రంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మదినాలు, జయంతులు, వివాహోత్సవ కార్యక్రమాలను మానసిక దివ్యాంగుల మధ్య జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ నాగమల్ల సుధీర్, వాసవి క్లబ్ అధ్యక్షుడు కరంచంద్, స్థానికులు పోలం రవీందర్, ప్రమోద్, నాగమళ్ల వనమాల, మానసిక దివ్యాంగుల కేంద్రం నిర్వాహకురాలు సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కమాండెంట్‌కు సన్మానం



మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డిని రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు ప్రకాశ్, ఇనుగాల జోగిరెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా టీఎస్ఎస్పీ పరిపాలన భవనంలో కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డిని వారు కలిసి జ్ఞాపిక అందజేసి సన్మానించి సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధికారులు కత్తి సమ్మయ్య, సర్వర్, ఎండి.నూరుద్దీన్, కుమారస్వామి, నాగరాజు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కాజీపేట: హనుమకొండ మచిలీబజారు గుడిబండల్‌లో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డాక్టర్ బండా ప్రకాశ్ శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. గుడిబండల్ పరపతి సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను విడుదల చేసి సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అశోక్, పులి రజనీకాంత్, పులి రమేష్, మధు ప్రభాకర్, పులి హరికృష్ణ, బయ్యా శోభన్, జయశంకర్, రవిందర్ రాజు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

హసన్‌పర్తి: ఈనెల 16న హసన్‌పర్తి కేంద్రంలో వాకర్స్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శరత్ కంటి వైద్య ఆస్పత్రి సౌజన్యంతో స్థానిక నేతాజీ పాఠశాలలో శిబిరం నిర్వహిస్తున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి శనివారం తెలిపారు. స్థానికులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు పండ్ల పంపిణీ



విద్యారణ్యపురి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని రాంనగర్‌లోని స్పందన మానసిక దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు శనివారం పండ్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ నర్సింహారావు, కార్యదర్శి అనంత్, సత్యనారాయణ, నిర్వాహకురాలు సుచరితారెడ్డి పాల్గొన్నారు.

మొబైల్ షాపులో భారీ చోరీ

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొబైల్ షాపులో శుక్రవారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ జీ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ చౌరస్తాలోని లాట్ మొబైల్ షాపు షటర్ తాళాలను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోకి ప్రవేశించారు. రూ.15 లక్షల విలువైన ఫోన్లను అపహరించారు. షాపు ఓపెన్ చేసేందుకు శనివారం ఉదయం నిర్వాహకులు వెళ్లగా షటర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని సెంట్రల్ జోన్ డీసీపీ అశోక్‌కుమార్, హనుమకొండ ఏసీపీ కిరణ్‌కుమార్, క్రైం ఏసీపీ డేవిడ్‌రాజ్, క్లూస్ టీం సభ్యులు పరిశీలించారు.

యాత్రను విజయవంతం చేయాలి

శాయంపేట: పీసీసీ ఆధ్వర్యంలో ఈనెల 26న ప్రారంభమయ్యే హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. మండల పార్టీ కార్యాలయంలో యాత్ర సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

- జాతీయ రహదారులపై వాహనాల అతివేగానికి కళ్లెం
- పోలీసుల ఆధ్వర్యంలో ప్రమాదజోన్ల గుర్తింపు
- స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డుల ఏర్పాటు



తిమ్మాపురం క్రాస్ రోడ్డుపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు



ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో..



స్టాప్ డ్రమ్‌లను ఏర్పాటు చేసిన పోలీసులు



హెచ్చరిక బోర్డును పరిశీలిస్తున్న పోలీసులు

ఖిలా వరంగల్: నగరంతోపాటు ఖమ్మం జాతీయ రహదారిపై తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉండటమే కాకుండా భారీ వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా లారీలు అతివేగంగా ప్రయాణించడంతో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ద్విచక్ర, చిన్నపాటి వాహనాల్లో ప్రయాణించే వారు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈక్రమంలో సీపీ ఏవీ.రంగనాథ్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా శాఖ, ఆర్‌అండ్‌బీ, పోలీస్ శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ప్రత్యేక జోన్లుగా గుర్తించి స్పీడ్ బ్రేకర్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. స్టాప్ డ్రమ్ములు, హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, స్టిక్కర్లు, స్పీడ్ బ్రేకర్లు అమర్చి అతివేగంగా వెళ్లే వాహనాలకు కళ్లెం వేస్తున్నారు. స్పీడు బ్రేకర్లు ఉన్నచోట వాహనచోదకులకు అర్థమయ్యేలా రహదారికి ఇరువైపులా రంగులతో కూడిన సూచిక గుర్తులు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



స్పీడు బ్రేకర్లు వాహనచోదకులకు కొంచెం ఇబ్బంది కలిగిస్తున్నా రోడ్డు ప్రమాదాల నివారణకు అవి ఎంతగానో దోహదపడుతాయి. ప్రమాదజోన్లను గుర్తించి హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి స్పీడ్ బ్రేకర్లు అమర్చాం. పూర్తి స్థాయిలో ప్రమాదాలను నివారించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం.

\- ముస్క శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, మిల్స్‌కాలనీ

ట్రాఫిక్ పోలీసుల విస్తృత తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

రామన్నపేట: పోలీసు కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు వరంగల్ నగరంలో విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపడుతున్నట్లు ట్రాఫిక్ సీఐ బాబులాల్ తెలిపారు. వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకపోవడంతో పాటు నంబర్లు ట్యాపరింగ్ చేసిన వాహనదారులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఎంజీఎం జంక్షన్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో నంబర్ ట్యాపరింగ్ చేసిన ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దేవశ్రీ వల్లభ, ఏళ్ల బోయిన సామిల్, కొలిపాక ఉదయ్, నక్కవాసు, నౌషాద్, మహ్మద్ సోహేల్, జన్ను ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అలాగే, వరంగల్ సబ్ డివిజన్ పరిధిలో నంబర్ ప్లేట్లు లేకపోవడంతో పాటు నంబర్ ట్యాంపరింగ్ చేస్తూ వాహనాలు నడుపుతూ పట్టుబడిన 33 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ బాబులాల్ తెలిపారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 9మందిపై, మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 18మంది, మిల్స్‌కాలనీ పరిధిలో ఆరుగురు వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పోటీల్లో ప్రతిభ చూపిన 'ఆర్ట్స్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, తదితరులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా వారిని కళాశాలలో ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, తదితరులు శనివారం అభినందించారు. జాతీయ స్థాయిలో యువజన సర్వీసుల జీ-20 ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ హసన్‌రజాక్ ప్రతిభ కనబరిచి గవర్నర్ తమిళిసై నుంచి బహుమతి అందుకున్నారు. యూనివర్సిటీలో వివేకానంద జయంతి సందర్భంగా వీసీ రమేష్ నుంచి ప్రశంసపత్రం స్వీకరించారు. అలాగే, వివిధ పోటీల్లో విజేతలైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నవీన్, సతీష్‌నాయక్, విజయలక్ష్మి, నాగరాజు, మీనా, వెంకటేష్, కృష్ణలతోపాటు హసన్‌రజాక్‌ను ప్రిన్సిపాల్ అయిలయ్య, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మాదాసి కనకయ్య, జె.చందులాల్, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఘనంగా భోగి సంబరాలు



హసన్‌పర్తిలో భోగి సంబరాలు



చాణక్య విద్యానికేతన్ స్కూల్‌లో ముగ్గులు

హసన్‌పర్తి: నగరవ్యాప్తంగా భోగి వేడుకలను ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాకిళ్లలో కల్లాపి చల్లి ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. హసన్‌పర్తి పెద్ద చెరువు కట్టపై వాకర్స్ ఆధ్వర్యంలో భోగి సంబరాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, వాకర్స్ ఆరెల్లి వెంకటస్వామి, గౌరిశెట్టి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చాణక్య విద్యానికేతన్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ విద్యానగర్ కాలనీ చాణక్య విద్యానికేతన్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ అచ్చ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో భోగి సంబరాలను నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ముగ్గులు వేసి గొబ్బెమలు పెట్టారు. సంప్రదాయ వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ముగ్గుల పోటీల విజేతలుగా బహుమతులు ప్రదానం చేశారు. ప్రవీణ్‌కుమార్, రహిమత్ అలీ, శ్వేత, సంధ్యారాణి, కోమల, శిరిష, రజిత, శాలిని, శైలజ పాల్గొన్నారు.

ఆరెపల్లిలో 30గొర్రెలు మృతి



చనిపోయిన గొర్రెలు

వరంగల్: ఆరెపల్లిలోని నర్సింగుల సురేష్ అనే గొర్రెల కాపరికి చెందిన 30 గొర్రెలు శనివారం ఆకస్మాత్తుగా స్పృహ కోల్పోయి మృతి చెందాయి. ఈమేరకు బాధితుడిని స్థానిక కార్పొరేటర్ జన్ను షీబారాణి శనివారం పరామర్శించారు. ఆర్థిక సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కాగా, గొర్రెల మృతికి కారణం తెలియాల్సి ఉంది. బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు రవి, నాయకులు అనిల్‌కుమార్, విజయ్, ఆదాం, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మోహన్, కుమార్, ప్యాక్స్ డైరెక్టర్ వంశీ, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఎస్ పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు?

కాజీపేట: చిన్న వయస్సులోనే జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు యువకులు చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా అందిన సమాచారం మేరకు వరంగల్ సీసీఎస్ పోలీసులు సదరు యువకులను శనివారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాజీపేట వైఎస్సాఆర్‌నగర్ కాలనీలో స్థిర నివాసం ఏర్పర్చుకున్న ఇద్దరు యువకులు నగరంలో తిరుగుతూ అనేక చిల్లర దొంగతనాలు చేస్తూ జల్సాలు చేస్తున్నారు. పెరిగిన సాంకేతికతను ఉపయోగించిన నిందితుల ఆచూకీని సీసీఎస్ పోలీసులు కనిపెట్టారు. తెల్లవారుజామున యువకులు ఇంట్లో ఉండగానే మఫ్టీలో ఉన్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వరంగల్‌కు తరలించినట్లుగా కాలనీవాసులు చెబుతున్నారు.

పేదల ఆకలి తీర్చిన ఘనత ఎఫ్‌సీఐది



ఎఫ్‌సీఐ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న అంపశయ్య నవీన్

కాజీపేట: దేశంలోని పేదల ఆకలి తీర్చిన గొప్ప చరిత్ర భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి ఉందని ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్ కొనియాడారు. కాజీపేట ఎఫ్‌సీఐ 59వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ అధికారులతో కీర్తి పురస్కార అవార్డు గ్రహీత నాగిళ్ల రామశాస్త్రి, అంపశయ్య నవీన్ కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వరంగల్ డివిజనల్ మేనేజర్ శ్రీప్రఖర్ వర్మ, ఏజీఎం సుస్మిత చక్రవర్తి, అడ్మిన్ సెక్షన్ అధికారి వేణు, డిపో మేనేజర్లు రావుల నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌కుమార్, ధీరజ్, వినోద్ కుమార్ రెడ్డి, అజ్మీరా జగ్గునాయక్, ఎఫ్‌సీఐ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్వెస్ట్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో 'రామన్' ప్రతిభ



అభినందిస్తున్న కరస్పాండెంట్, డైరెక్టర్

హన్మకొండ: క్వెస్ట్ సైన్స్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలో హనుమకొండ సుబేదారిలోని రామన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయిలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీ పరీక్షలో రామన్ స్కూల్ విద్యార్థులు 25లోపు ర్యాంకులను ఏడుగురు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ రాజేష్, డైరెక్టర్ పురుషోత్తం తెలిపారు. 140 మంది విద్యార్థులు 2వేల లోపు ర్యాంకులు సాధించారని తెలిపారు. 3వ తరగతిలో జి.కార్తికేయ 15వ ర్యాంకు, 6వ తరగతిలో జి.సుశాంత్ గౌతమ్ 8వ ర్యాంక్, 7వ తరగతిలో ఎస్.శ్రీసాయిమల్లిక్ 22వ ర్యాంకు, 8వ తరగతిలో ఆర్.జయంత్ 3వ ర్యాంకు, 9వ తరగతిలో వి.సహ్యా 14వ ర్యాంకు, 10వ తరగతిలో ఆతిఫ్ షరీఫ్ 18వ ర్యాకు, సారాసమ్రిన్ 22వ ర్యాంకు సాధించారని వివరించారు. పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను కరస్పాండెంట్ రాజేష్ కుమార్, డైరెక్టర్ పురుషోత్తం, తదితరులు అభినందించారు.

వందేభారత్‌కు ఘన స్వాగతం పలకాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కాశిబుగ్గ: వందేభారత్ రైల్‌కు ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలకాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ఆధ్వర్యంలో వరంగల్ స్టేషన్ మాస్టర్‌ను శనివారం కలిసి రైలు వివరాలు, ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్, ధర్మారావు మాట్లాడుతూ తెలుగు ప్రజలకు సంక్రాంతి కానుకగా వందే భారత్ రైలును ప్రధాని మోదీ కేటాయించారని గుర్తుచేశారు. ఈక్రమంలో వరంగల్‌లో వందేభారత్ రైలుకు ఘన స్వాగతం పలకాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఎరుకుల రఘునారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్‌షా, నాయకులు వంగాల సమ్మిరెడ్డి, తూర్పు నియోజకవర్గ నాయకులు కుసుమ సతీష్, ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, వంగల వెంకటరమణ, మల్లాది తిరుపతిరెడ్డి, బన్న ప్రభాకర్, అపురూప రజనీష్‌నేత, కార్యదర్శి సుమన్ కాత్రి, తూర్పు నియోజకవర్గ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్‌గుప్తా, మల్లాడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న రావు పద్మ

హసన్‌పర్తి: ఈనెల 15నుంచి 20వరకు మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయిపవర్ లిఫ్టింగ్ పోటీలకు హనుమకొండ జిల్లా భీమారంలోని కమల్ నేషనల్ జిమ్ క్రీడాకారులు పాల్గొననున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన చిట్యాల ప్రత్యూష, గుండనేని శృతి, మౌటం త్రిష, కత్తుల రోహన్, ఎండి.ఫరాన్, కస్తూరి ప్రశాంత్ పాల్గొని ప్రతిభ కనబరిచారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సంగాల కమల్ తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండలో శనివారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ కత్తుల కవిత, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్యామ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రవి

మామునూరు: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా సూచించారు. వరంగల్ మార్కండేయ నగర్‌లో సీపీఐ నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడాకారులను పోత్సహించేందుకు క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత తామందరిపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దండు లక్ష్మణ్, బుస్స రవీందర్, రాజు, ఎండి అక్బర్‌పాషా, ల్యాదల్ల శరత్, ఎండి.యాకూబ్, కేశపాక మోహన్, జన్ను రాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ గుజ్జుల రాజ్‌కుమార్‌కు సన్మానం



డాక్టర్ రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వాసం వెంకటేశ్వర్లు

వరంగల్ రూరల్: 25ఏళ్లుగా అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తూ జిల్లా, రాష్ట్ర ఉత్తమ యువజన అవార్డులతో పాటు 2001లో జాతీయ యువజన అవార్డు అందుకున్న డాక్టర్ గుజ్జుల రాజ్‌కుమార్‌ను రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు సన్మానించారు. ప్రపంచదేశాల్లో యువజన సదస్సుల్లో పాల్గొని అంతర్జాతీయ అవార్డులు అందుకున్న రాజ్‌కుమార్.. ప్రస్తుతం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో డీఆర్‌డీఏ డీపీఎంగా పనిచేస్తున్నారు. కాగా, హైదరాబాద్ శిల్పారామంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర యువజన ఉత్సవాల ముగింపు సమావేశంలో డాక్టర్ రాజ్‌కుమార్‌ను వాసం వెంకటేశ్వర్లు సన్మానించారు. ఈమేరకు ఆయనను పలువురు అభినందించారు.

వైభవంగా గోదాదేవి తిరుకల్యాణం



గోవిందాద్రి ఆలయంలో గోదాదేవి తిరుకల్యాణ వేడుకలు



మడికొండలో వేణుగోపాలస్వామి



కాజీపేటలోని శ్వేతార్క ఆలయంలో..

వరంగల్ చౌరస్తా: వరంగల్‌లోని గోవిందాద్రి కొండపై గోదాదేవి తిరుకల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని చివరి రోజు కనులపండువగా జరిగిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వాణి దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కార్యక్రమంలో వేద పండితులు వరయోగుల సాయిమనోజ్, పవన్‌కుమార్, వరయోగుల శ్రీనివాసస్వామి, జగన్నాథం, కిరణ్, శ్రీకాంత్, వేణుమాధవ్, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు చింతాకుల సునీల్‌కుమార్, శ్రీనివాస్, ఇప్ప ఆదినారాయణ, ఆలయ కార్యనిర్వాహణాధికారి వై.రత్నాకర్ రెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలోని శ్వేతార్కలో..

కాజీపేట: తిరుప్పావై వేడుకల్లో భాగంగా కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయం ఆవరణలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి – రంగనాయకుల కల్యాణ వేడుకలను వేద పండితులు శనివారం జరిపించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణశర్మ, మహతి దంపతులు వధూవరుల పక్షాన నిలబడి వివాహ తంతు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను పండితుడు టంటం దయాకరస్వామి కనుల పండువగా జరిపించారు. భక్తులకు అన్నపూర్ణ కేంద్రంలో ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ, అనంతమల్లయ్యశర్మ సిద్ధాంతి, సాయికృష్ణశర్మ, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో..

మడికొండ: మడికొండలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో గోదాదేవి కల్యాణాన్ని అర్చకులు శనివారం వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ప్రతేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నిగ్గుల సతీష్, దువ్వ శ్రీకాంత్, కడార్ల నరేందర్, ఉపేంద్రచారి, టి.యాదగిరి, బజ్జూరి శ్రీనివాస్, నరేంద్రచారి పాల్గొన్నారు.

'మల్లికాంబ'లో దుస్తుల పంపిణీ



మాట్లాడుతున్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట / హన్మకొండ కల్చరల్: మల్లికాంబ మనోవికాస కేంద్రంలో దివ్యాంగులైన పిల్లలకు నూతన వస్త్రాలు, బూట్లను ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ శనివారం పంపిణీ చేశారు. మిర్యాల్‌కార్ సూరజ్ ఛారిటబుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ మిర్యాల్‌కార్ దేవేందర్ అందించిన వస్తువులను పిల్లలకు అందించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల కోమలకిషన్, ఖాజా సిరాజుద్దీన్, శ్రీధర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.